
సాక్షి
తిరుపతి

శుక్రవారం । 29 । నవంబర్ । 2024



స్వర్ణముఖి నదీ హారతి రేపు
శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో స్వర్ణముఖి నదిలో శనివారం నదీ హారతులు ఇవ్వనున్నట్లు ఈఓ తెలిపారు. - 8లో



ప్రజాస్వామ్యానికి తూట్లు
కూటమి సర్కారు హామీలు అమలు చేయకుండా ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తోందని మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య అన్నారు. - 8లో



శ్రీవారి సేవలో 399 మంది..
తిరుమల శ్రీవారిని గురువారం 399 మంది ప్రత్యేక ప్రతిభావంతులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు స్విమ్స్ ఎమ్మెస్సీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్ కోర్సుల్లో ఖాళీలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ కోర్సులో ఒక సీటు, ఎమ్మెస్సీ బయోఇన్ఫర్మేటిక్స్ కోర్సులో 4 సీట్లు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఏపీ పీజీసెట్–2024లో క్వాలిఫై అయిన అభ్యర్థులు, క్వాలిఫై కానీ అభ్యర్థులు, సెట్ రాయని అభ్యర్థులు సైతం ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 29వ తేదీ హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు స్విమ్స్ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

నూతన ఆవిష్కరణల్లో డిజిటల్ టెక్నాలజీ పాత్ర కీలకం



కార్యక్రమానికి హాజరైన అతిథులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: నూతన ఆవిష్కరణలు, స్టార్టప్ అవకాశాలను ప్రోత్సహించడంలో డిజిటల్ టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తోందని కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ సైంటిస్ట్ డాక్టర్ త్రిప్తా గార్గ్ తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీ టెక్నాలజీ ఔట్ రీచ్ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ కోలాబరేషన్(టీఓసీఐసీ), ఇన్నోవేషన్ అండ్ ఫెసిలిటేషన్ ఇనిషియేటివ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలకు డిజిటల్ టెక్నాలజీపై అవగాహన కల్పించేందుకు టెక్నో అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. గురువారం వర్సిటీ సావేరీ సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలకు సాధికారత కల్పించడంలో టెక్నో అవేర్‌నెస్ ప్రోగ్రాం ఉపయోగపడుతుందన్నారు. బిజినెస్ ఇన్నోవేషన్, స్టార్టప్ సక్సెస్ కోసం డిజిటల్ టూల్స్‌ను ఉపయోగించుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కళారాణి, డీన్ పీ విజయలక్ష్మి, మోటివేషన్ స్పీకర్ కోమల రవిచంద్రన్, చెన్నై క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, కోఆర్డినేటర్లు జోత్స్న, సుజాత పెద్ద సంఖ్యలో మహిళా పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లూరు అటవీ అధికారి తనిఖీలు



అటవీ అధికారులతో మాట్లాడుతున్న డీఎఫ్ఓ మహబూబ్ బాషా

సైదాపురం: నెల్లూరు జిల్లా అటవీ శాఖాధికారి కె మహబూబ్ బాషా సైదాపురం మండలంలో తనిఖీలు చేపట్టారు. పొలూరు రాజుపాళెంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న 14 శ్రీగంధం చెట్లు రవాణా చేసుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని గ్రామానికి చెందిన కె అంజనేయులు అనే రైతు పిటిషన్ పెట్టుకోవడంతో శ్రీగంధం చెట్లను గురువారం డీఎఫ్ఓ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఊటుకూరు గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో ఉన్న అమృతేష్ మైకా మైన్స్‌తోపాటు, సైదాపురం అటవీ ప్రాంతంలో ఉన్న కేఎంసీ మైకామైన్స్‌ను కూడా ఆయన పరిశీలించారు. ఆయన వెంట నెల్లూరు రేంజర్ మాల్యాద్రి, సిబ్బంది రవిశేఖర్ తదితరులుఉన్నారు.

డిసెంబర్‌లో విశేష పర్వదినాలు

తిరుమల: డిసెంబర్ నెలలో తిరుమలలో జరిగే విశేష పర్వదినాలను టీటీడీ పీఆర్వో విభాగం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ మేరకు.. ఒకటిన శ్రీవారి ఆలయంలో నాలుగో విడత అధర్వణ వేదపారాయణం ప్రారంభం, 11న సర్వ ఏకాదశి, 12న చక్రతీర్థ ముక్కోటి, 13న తిరుమంగై ఆళ్వార్ శాత్తుమొర, 14న తిరుప్పాణాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 15న శ్రీవారి ఆలయంలో కార్తీక దీపోత్సవం, 16న ధనుర్మాసారంభం, 26న సర్వ ఏకాదశి, 29న మాస శివరాత్రి, తొండరడిప్పొడియాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 30న శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 67,626 మంది స్వామివారిని దర్శించుకోగా 22,231 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.75 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పడగల నీడన పగడపు తల్లి



పద్మావతీ అమ్మవారుకి ఊంజల్ సేవ

దేవతలు అతిథులుగా రాగా.. అఖిల భక్తకోటి ఆనంద పరవశం కాగా.. ఎగిరింది ధ్వజపటం.. బ్రహ్మాండ నాయకుడి ప్రియదేవేరి పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు జరిగింది శ్రీకారం.. తిరుచానూరులో అమ్మవారి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాత్రి శ్రీవారి దేవేరి చిన్న శేషవాహనంపై మురళీకృష్ణుడి రూపంలో భక్తజనాన్ని కటాక్షించారు.

–చంద్రగిరి



చిన్న శేషవాహనంపై ఊరేగుతున్న అమ్మవారు




కనుమరుగు రొయ్యో..!

కుయ్యో.. రొయ్య!

- మూత పడిన రొయ్య పిల్లల హేచరీలు
- 4 వేల హెక్టార్ల నుంచి 600 హెక్టార్లకు పడిపోయిన సాగు విస్తీర్ణం
- రూ.వందల కోట్ల నష్టాలు
- సతమతమవుతున్న హేచరీ యజమానులు

కూటమి సర్కారు కుట్ర.. అందని ప్రోత్సాహకం.. పెరిగిన విద్యుత్ చార్జీలు.. నాసిరకం రొయ్య పిల్లల ఉత్పత్తి.. క్షీణించిన ఎగుమతులు.. దక్కని గిట్టుబాటు ధరలు.. వెరసి.. ఆక్వాకల్చర్ చతికిలపడింది. కొనేనాథులు లేక హేచరీలు మూతపడ్డాయి.. ఫలితంగా రొయ్యల చెరువులు వరి మడులుగా మారాయి. కుబేరులుగా మారిన ఆక్వా రైతులు ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన దుస్థితి నెలకొంది.



వాకాడు: నాడు రొయ్యల సాగు చేసిన రైతులు, హేచరీల యజమానులు కుబేరులుగా మారారు. అయితే నేడు రొయ్యల పరిశ్రమకు గడ్డు కాలం వచ్చింది. దీంతో జిల్లాలో ఆక్వా మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అప్పట్లో రొయ్యలు విదేశాలకు ఎగుమతి కావడంతో విదేశీ మారక ద్రవ్యం బాగా పెరిగి ఎంతో మంది రైతులు కుబేరులుగా మారారు. దీంతో ఆక్వాసాగు నలు మూలలకు విస్తరించింది. అనేక ప్రాంతాల్లో రైతులు, చిన్న చిన్న వ్యాపారులు, ఉద్యోగులు సైతం లాభాలు గడించేందుకు తమ వృత్తులకు స్వస్తి పలికి ఆక్వా సాగులోకి ప్రవేశించారు. ఆక్వా సాగుకు అనుగుణంగా జిల్లా సముద్ర తీరం వెంబడి 24 రొయ్య పిల్లల కేంద్రాలు వెలిశాయి. అందులో వాకాడు మండలంలో 23, కోట మండలంలో ఒక హేచరీ ఉన్నాయి.

జిల్లాలోనే మొట్ట మొదటిసారి..

1990–91లో వాకాడు మండల తీర ప్రాంత గ్రామాలు అందలమాట, వాలమేడు ప్రాంతాల్లో రొయ్యిల సాగు ప్రారంభమైంది. అప్పటి నుంచి కనక వర్షం కురిపించిన ఆక్వా రంగం అందరినీ ఆకర్షించింది. అనేక ప్రాంతాల్లోని పలువురు రైతులు లాభాలు గడించేందుకు వరి పంటలను వదిలేసి ఆక్వా సాగులోకి ప్రవేశించారు. అప్పట్లో వరి సాగు విస్తార్ణం తగ్గిపోయి ఆక్వా సాగు పెరిగిపోయింది. వరుస నష్టాలతో రైతులు ఆక్వా సాగును వదిలేసి మళ్లీ వరిసాగులోకి వస్తున్నారు.

ఎక్కువసార్లు పిల్లల ఉత్పత్తితో నాణ్యత క్షీణత

రొయ్యి పిల్లలను ఉత్పత్తి చేసే బ్లోడర్స్ విషయంలో హేచరీల వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఒక తల్లి రొయ్యి (బ్లోడర్)తో మూడు సార్లు మాత్రమే రొయ్యి పిల్లలు పెట్టించాలి. అలా జరిపితేనే సాగు సక్సెస్ అవుతుంది. అదే తరహాలోనే వైరస్ లేకుండా మంచి దిగుబడులు కూడా వస్తాయి. ఈ ప్రక్రియ ఏ ఒక్క హేచరీలో కూడా జరగడంలేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

కొనేవారు లేక మూతబడిన 20 హేచరీలు



తూపిలిపాళెం వద్ద వ్యాపారాలు లేక మూతబడిన హేచరీ

జిల్లాలో తీరం వెంబడి 17 రొయ్య పిల్లల ఉత్పత్తి హేచరీలు ఉన్నాయి. అందులో 3 హేచరీలు మాత్రమే ప్రస్తుతం అంతంత మాత్రంగా నడుస్తున్నాయి. జిల్లాలో 2022 వరకు 4 వేల హెక్టార్లలో ఆక్వా సాగు సాగేది. అయితే రాను రాను రొయ్యల సాగులో రైతులకు నష్టాలే మిగలడంతో ఒక్కొక్కరుగా సాగుకు దూరమయ్యారు. ప్రస్తుతం చిల్లకూరు, గూడూరు, కోట, వాకాడు, చిట్టమూరు, సూళ్లూరుపేట, తడ మండలాల్లో కేవలం 800 హెక్టార్లలో మాత్రమే సాగు ఉంది. దీంతో రొయ్య పిల్లలు కొనే వారు లేక హేచరీలు ఒక్కొక్కటిగా మూత పడ్డాయి. హేచరీల యజమానులకు వ్యాపారాలు లేక పెట్టిన పెట్టుబడులు రాక లబోదిబోమంటున్నారు. ఒక హేచరీ నిర్మించాలంటే దాదాపు రూ.3 కోట్ల నుంచి రూ.11 కోట్లు వరకు ఖర్చు అవుతుంది. అందులో దాదాపు 50 నుంచి 100 మంది వరకు వర్కర్లు ఉంటారు. ఒక్కొక్కరికి రూ.15 నుంచి రూ.40 వేలు వరకు జీతాలు ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే కూటమి సర్కారు హేచరీలకు కరెంటు బిల్లులపై రాయితీ ఇస్తామని చెప్పి రూ.6.50కు పెంచి మోసం చేయడంతో మరింత భారం పడింది. దీంతో ఏటా రూ.కోట్లల్లో నష్టాలు రావడంతో హేచరీ నిర్వాహకులు నష్టాలు భరించలేక చేతులు ఎత్తేశారు. వేలాది మంది పనిలేక రోడ్డున పడ్డారు.



రొయ్యలు

కొన్ని హేచరీలు తొలి కాన్పులో పెట్టించిన పిల్లలు, అలాగే 7, 8 కాన్పుల్లో పెట్టించిన పిల్లలను మిక్సింగ్ చేసి రైతులకు అంటగడుతున్నారు. ఇలా చేయడంతో అవి చెరువుల్లో ఎదుగుదల తగ్గిపోయి వివిధ సైజుల్లో పెరుగుతున్నాయి. ప్రతి హేచరీకి ఇతర దేశాల నుంచి నాణ్యమైన బ్లోడర్స్ వస్తాయని రైతులకు ఒక నమ్మకం ఉంది. కాని ఇతర దేశాల నుంచి ఒక తల్లి రొయ్యను (బ్లోడర్)ను తెప్పించి దాంతోపాటు లోకల్ బ్లోడర్స్‌ని కలిపి పిల్లలను ఉత్పత్తి చేసి రైతులను మోసం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ హేచరీలపై నమ్మకం లేని ఆక్వా రైతులు పాండిచ్చేరి, భీమవరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి సీడ్ కొనుగోలు చేసేవారు.

నాణ్యమైన తల్లి రొయ్యతోనే అధిక దిగుబడి

అధిక నాణ్యత కలిగిన రొయ్య పిల్లలను స్థిరంగా ఉత్పత్తి చేయడం, అలాగే రొయ్యల సాగు అవసరాలను తీర్చడానికి తీరంలో హేచరీలను ఏర్పాటు చేశారు. రొయ్య పిల్లల ఉత్పత్తి కోసం ఒకప్పుడు అమెరికా నుంచి అర్డిలైన్, షేనెట్ తదితర కంపెనీల నుంచి తల్లి రొయ్యలు రాష్టానికి వచ్చేవి. ఆయా కంపెనీలకు ముందుగా హేచరీల యజమానులు ఒక్కో తల్లి రొయ్యకు రూ.7 వేల నుంచి రూ.10 వేలు వరకు నగదు చెల్లించి ఆర్డర్ పెట్టుకోవాలి. ఆ తరువాత బ్రోడర్స్(తల్లి రొయ్యలు) అమెరికా నుంచి ప్రభుత్వ మత్స్యశాఖ ల్యాబ్‌లకు వస్తాయి. అక్కడ పూర్తి స్థాయిలో తల్లిరొయ్యకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన తరువాతే బుకింగ్ చేసుకున్న ఆయా హేచరీలకు చేరుతాయి. హేచరీలకు చేరిన తరువాత మళ్లీ కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ(సీఏఏ) వారు పరిశీలన అనంతరం వారి అనుమతి మేరకు వాటి ద్వారా గుడ్లు పెట్టించడం జరుగుతుంది. జిల్లాలో అనుమతి లభించిన హేచరీలన్నీ వంద మిలియన్‌ల సీడ్ ఉత్పత్తి చేసే సామర్థం కలిగినవే. కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులకు లోబడి మాత్రమే సీడ్ ఉత్పత్తి చేయాల్సి ఉంది. తద్వారా ఉత్పత్తి చేసిన పిల్లలకు ఎలాంటి వ్యాధులు లేకుండా, మంచి పెరుగుదల వచ్చేటట్లు ముందుస్తు పరీక్షలు నిర్వహించి రైతులకు ఇవ్వాలి. ఇలా చేయడంతో రైతులు అనుకున్న దిగుబడుల కంటే అధనపు దిగుబడులు సాధించడం జరుగుతుంది. ఇలా చేయడంతో 1996–2012 మధ్య కాలంలో రొయ్యల దిగుబడులు అధికంగా రావడం, ఉత్పత్తులకు మంచి గిరాకీ ఏర్పడి ఈ ప్రాంతాల నుంచే ఎక్కువ మొత్తంలో రొయ్యిలు యూరోపియన్ దేశాలకు ఎగుమతి అయ్యాయి. ఈ క్రమంలో ప్రభుత్వ ఖజానాకు మంచి ఆదాయం వచ్చేది.

ఆక్వా రైతుకు జగనన్న అండ

గత ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా రైతులకు అండగా నిలిచారు. రొయ్య సాగు చేసే రైతులకు పలు రాయితీ ఇచ్చి, వారిని ఆదుకున్నారు. దీంతో ఆగిపోయిన రొయ్య ఎగుమతులను కరోనాలో సైతం యూరోపియన్ దేశాలకు ఎగుమతి జరిగింది. అదే సమయంలో ఆక్వా రైతుల కష్టాలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి అంతర్జాతీయ ఆక్వా మార్కెట్‌లో డాలర్ల సేద్యంగా మారిన టైగర్ రొయ్యల సాగుకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టింది. దేశ వ్యాప్తంగా 6 హేచరీల ద్వారా టైగర్ రొయ్య పిల్లల ఉత్పత్తికి అనుమతి లభించగా అందులో ఒక ఏపీలోనే 5 హేచరీలకు అనుమతులను తీసుకొచ్చింది. ఈ క్రమంలో జిల్లాకు 3 హేచరీలకు టైగర్ సీడ్ ఉత్పత్తికి అనుమతి లభించచడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అధికంగా 76 రొయ్య పిల్లల హేచరీలు ఉండగా అందులో 3 హేచరీల్లో మాత్రమే టైగర్ సీడ్‌తోపాటు, లార్వా రేరింగ్ ఉత్పత్తికి అనుమతి లభించింది. అయితే నేడు హేచరీల యజమానులు 30 పైసలకు రొయ్యిపిల్లను విక్రయిస్తున్నా కొనే వారు కరువయ్యారు.



అరకొరగా నడుస్తున్న హేచరీ (ఇన్‌సెట్) గుడ్లు నుంచి వచ్చిన పిల్లలు

ఆక్వా కల్చర్ తగ్గిన మాట వాస్తవమే



జిల్లాలో 24 రొయ్య పిల్లల హేచరీలున్నాయి. అందులో మూడు మాత్రమే రన్నింగ్‌లో ఉన్నాయి. వివిధ కారణాలతో కల్చర్ తగ్గిన మాట వాస్తవమే. దీంతో హేచరీలు షట్‌డౌన్ అయ్యాయి. త్వరలోనే కల్చర్ పూర్తిస్థాయిలో ప్రారంభించి, గతంలో మాదిరి అన్ని హేచరీలు పనిచేస్తాయని అనుకుంటున్నాను.

– నాగరాజు, జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ తిరుపతి

ఆత్మీయ నివాళి



సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడికి గురువారం సీఎం చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అంజలి ఘటించారు. రామ్మూర్తి నాయుడు కర్మక్రియల్లో భాగంగా సీఎంతో పాటు మంత్రి నారా లోకేష్ ఇతర కుటుంబ సభ్యులు గురువారం నారావారిపల్లికి చేరుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలోని బావి వద్ద సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు నారా రోహిత్, నారా గిరీష్‌తో కలసి పిండ ప్రదానం, కర్మక్రియల్లో పాల్గొన్నారు. హిందూ సంప్రదాయ పద్ధతిలో కార్యక్రమాలను పూర్తి చేశారు. కాగా సోదరుడు కర్మక్రియలకు హాజరైన సీఎం చంద్రబాబు శుక్రవారం ఉదయం తిరుగు ప్రయాణం కానున్నారని జిల్లా అధికార యంత్రాంగం ఓ ప్రకటనలో తెలిపింది.

– చంద్రగిరి

పూలే సేవలు చిరస్మరణీయం



పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మజ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన పూలే వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు చదువుకోవాలని పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించడానికి చేసిన కృషిని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే ముందుగా తమ సతీమణి సావిత్రి పూలేకి విద్య నేర్పించి, ఆ తర్వాత ఆమె ద్వారా ఎంతోమంది మహిళలను విద్యావంతులను చేశారని తెలిపారు. అదే స్ఫూర్తితో మహిళలతో పాటు అందరూ ఉన్నతస్థాయికి చేరుకోవడానికి విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో నరసింహులు, సమాచారశాఖ జిల్లా అధికారి బాలకొండయ్య, పలువురు కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అటవీ స్థల వివాదంపై విచారణ


విచారణ జరుపుతున్న అధికారులు

తిరుపతి మంగళం : తిరుపతి నగర పరిధిలోని తిమ్మినాయుడుపాళెం దళితవాడలో శ్మశాన స్థల వివాదంపై గురువారం అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. అటవీ స్థలంలో దళితులు అంతిమ సంస్కారాలు నిర్వహించడంపై సమీపంలోని లేఔట్లో ప్లాట్లు కొన్నవారు అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు తిరుపతి అటవీశాఖ సబ్ డీఎఫ్ఓ నాగభూషణం ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు, అలిపిరి పోలీసులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి, దళితవాడ వాసుల వాగ్మూలాలను తీసుకున్నారు. స్థలంపై చర్చలు జరుగుతున్న తరుణంలోనే స్థానిక లేఅవుట్ వాసులు కోర్టులో కేసు వేయడం దారుణమన్నారు. సబ్ డీఎఫ్ఓ మాట్లాడుతూ కోర్టులో తీర్పు వెలువడే వరకు అనుమతులు లేకుండా అడవిలోకి ప్రవేశించరాదని గ్రామస్తులను హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం వాయిదా

వరదయ్యపాళెం: సత్యవేడులో ఈ నెల 30వ తేదీ జరగాల్సిన నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం వాయిదా పడినట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. తిరిగి డిసెంబర్ 3న సమావేశం నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు.

మెగా.. దగా



పూతలపట్టుకు చెందిన రాజేశ్వరి భర్తతో పాటు తిరుపతిలో ఉంటోంది. ఓ ప్రైవేటు స్కూల్లో టీచరుగా చేస్తుండేది. కూటమి సర్కారు డీఎస్సీపై ఆశలు కల్పించడంతో ఉద్యోగాన్ని మానేసి, తిరుపతి వచ్చి 5 నెలలుగా పరీక్షకు సిద్ధమవుతోంది. ఆమెకు ఉన్న ఇద్దరు పిల్లల్లో ఒకరిని భర్త చూసుకుంటుండగా, మరో పిల్లాడ్ని తల్లి వద్ద ఉంచి, ఎలాగైనా కొలువు సాధించాలన్న పట్టుదలతో చదువుతోంది. కానీ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటన ఆలస్యమవతుండడంతో మానసిక ఒత్తిడికి గురవుతోంది. ఒక్క రాజేశ్వరికే కాదు.. డీఎస్సీ శిక్షణ తీసుకుంటున్న నిరుద్యోగులందరి వేదన..

- ఉమ్మడి జిల్లాలో 1,473 ఖాళీల గుర్తింపు
- ఎదురుచూపుల్లో నిరుద్యోగులు
- రోస్టర్ పాయింట్ల వెరిఫికేషన్ పేరిట తాత్సారం
- పోస్టుల బ్లాక్‌తో పదోన్నతులకు చెక్
- కూటమి ప్రభుత్వం రోజుకో ప్రకటనతో గందరగోళం

తిరుపతి ఎడ్యుకేషన్ : మెగా డీఎస్సీ ప్రకటనపై నిరుద్యోగులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే అని గొప్పలు పలికిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా నోటిఫికేషన్ ఊసేలేదు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై రోజుకో ప్రకటన చేయడంతో నిరుద్యోగులు అయోమయ స్థితిలో ఉన్నారు. ఈ నెల 6న నోటిఫికేషన్ జారీ చేస్తారని, ఎంతో ఆశగా ఎదురుచూసిన నిరుద్యోగులకు వాయిదా పడడంతో నిరాశే మిగిలింది. ఇంతకీ ఈ విద్యా సంవత్సరంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందో..? లేదోనన్న సందేహాలు నెలకొన్నాయి. టెట్ క్వాలిఫైడ్ అభ్యర్థులు డీఎస్సీకి రేయింబవళ్లు సిద్ధమవుతున్నారు. కొందరు ప్రైవేటు స్కూళ్లలో ఉద్యోగాలు మానేసి.. మరీ డీఎస్సీకి శిక్షణ తీసుకుంటున్నారు. అదిగో.. ఇదిగో అంటూ కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుండడంపై నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రోస్టర్ పాయింట్లతో రాద్ధాంతం

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసమని ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఖాళీ పోస్టుల రోస్టర్ పాయింట్ల లెక్క తేల్చాలని ఇటీవల విద్యాశాఖ ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లో రోస్టర్ పాయింట్ల వ్యవహారంతో ఇటీవల జరిగిన ప్రమోషన్ల ప్రక్రియలో పెద్ద రాద్ధాంతమే జరిగింది. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీపై కాలయాపన చేస్తున్న నేపథ్యంలోనే తేనెతుట్టెను కదుపుతోందని ఉపాధ్యాయులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖలో విలీనమైన సమయంలోనే మున్సిపల్ యాజమాన్య స్కూళ్లలో క్యాడర్ స్ట్రెంత్ వివరాలను స్థిరీకరించాల్సి ఉండగా, అప్పట్లో జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకోకపోవడంతో ఇప్పుడు సమస్యలొచ్చిపడ్డాయంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.



ఖాళీల గుర్తింపుపై మీనమేషాలు

మెగా డీఎస్సీలో రాష్ట్ర వ్యాప్తంగా 16,347 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు, ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 1,473 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తొలుత ప్రచారం జరిగింది. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మిగులు ఉపాధ్యాయులు ఉన్నారన్న క్షేత్రస్థాయి నివేదికలతో ప్రభుత్వం డైలమాలో పడింది. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,473 ఖాళీలున్నట్లుగా విద్యాశాఖాధికారులు లెక్క తేల్చారు. వీటిలో ఎస్జీటీ పోస్టులు 944కాగా, స్కూల్ అసిస్టెంట్లు ఇంగ్లిష్–108, తెలుగు–42, హిందీ–21, ఉర్దూ–5, తమిళం–2, బోటనీ సైన్స్–69, గణితం–33, ఫిజికల్ సైన్స్–29, సోషియల్–133, ఫిజికల్ ఎడ్యుకేషన్–87 వరకు ఉన్నాయి. దీనిపై కూడా అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీపై రోజుకో ప్రకటన చేస్తుండడంపై నిరుద్యోగులు అయోమయానికి గురవుతున్నారు.

ఆందోళనలో అభ్యర్థులు

కూటమి నేతలు ఎన్నికల్లో మెగా డీఎస్సీ హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే ఉత్తుత్తి సంతకాలు చేసి, మమ అనిపించింది. డీఎస్సీ వస్తుందన్న ధీమాతో అభ్యర్థులు తాము చేస్తున్న ప్రైవేట్ కొలువులను వదలి, శిక్షణ తీసుకున్నారు. అయితే కూటమి సర్కారు రోజుకో మాట చెబుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో కోత

మెగా డీఎస్సీ సాకుతో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతలను కూటమి ప్రభుత్వం కోత పెడుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నెలవారీ పదోన్నతుల ప్రక్రియ జరిగేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటి ఊసే లేదు. డీఎస్సీ కోసం చూపించిన ఖాళీ విషయంలో జరిగిన తప్పిదాలతో మరోసారి ఖాళీల గుర్తింపుపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం రోజుకో నిర్ణయం తీసుకుంటుండడంతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీపై నీలినీడలు కమ్ముకుంటుండడంతో డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటుంది.

రబీలో ఈ-క్రాప్ నమోదు చేసుకోండి


ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు

చంద్రగిరి: రబీలో సాగు చేసే పంటలకు ఈ-క్రాప్ నమోదు ర్యక్రమం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైందని, ప్రతి రైతూ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ రావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని భీమవరంలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, వడ్డీలేని పంట రుణాలతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించినప్పటికీ ఈ-పంట ద్వారా నమోదు చేసుకోకపోతే బీమా రాదన్నారు. మద్దతు ధరకు పంట ఉత్పత్తుల కొనుగోలు చేయాడానికి కూడా తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ-క్రాప్‌తోపాటు పంట బీమా తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఆయన కోరారు.

మత్తుపై ఉక్కుపాదం


రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

తిరుపతి రూరల్: గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాతో పాటు అక్రమ మద్యం విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి ఆదేశించారు. తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సారా, గంజాయి ఎన్డీపీఎల్ కేసులపై సమీక్ష నిర్వహించారు. రూరల్ సర్కిల్ సీఐ నరసానాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని కొన్నెంబట్టు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం మాజీ వలంటీర్ మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం.. పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం ప్రాంతానికి చెందిన నాగరాజు, తన స్నేహితుడు దొరవారిసత్రం మండలంలోని పోలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ధనుంజయ(32)తో బైక్‌పై సంతవేలూరు సమీపంలోని సీసీఎల్ కంపెనీకి బయల్దేరారు. మార్గ మధ్యంలో నిర్మాణంలో ఉన్న కల్వర్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ధనుంజయ అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు దొరవారిసత్రం మండలంలో వలంటీర్‌గా పనిచేశాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


స్వర్ణముఖి నదీ హారతి రేపు


వంతెన వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో స్వర్ణముఖి నదిలో శనివారం నదీహారతి సమర్పించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 7 గంటలకు స్వర్ణముఖి నది తల్లికి కలశ పూజలు, ధూప, దీప నైవేద్యాలు, మహాదీపారాధన చేయనున్నట్లు తెలిపారు. భక్తులు వీక్షించడానికి ఏర్పాట్లు కూడా చేసినట్లు పేర్కొన్నారు. కాగా నదీహారతులను పురస్కరించుకుని శనివారం ఆలయంలో రాహుకేతు సర్పదోష నివారణ పూజలు మినహా మిగిలిన ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు చెప్పారు.

ఏర్పాట్లు ముమ్మరం

శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో స్వర్ణముఖిలో కార్తీక మాసం సందర్భంగా జరగనున్న నదీహారతుల కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పట్టణంతోపాటు ఆలయ పరిసరాలు విద్యుత్ దీపకాంతులు ధగధగలాడుతున్నాయి. దేవతామూర్తుల కటౌట్లు ఆకట్టుకుంటున్నాయి. నదిలో హారతులు ఇచ్చేందుకు వేదిక, భక్తులు వీక్షించేందుకు తగిన ఏర్పాట్లు కూడా చేశారు.


స్వర్ణముఖి నదిలో ఏర్పాట్లు

ప్రజాస్వామ్యానికి తూట్లు

- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, హామీలు అమలు చేయకుండా ప్రజాస్వామ్యానికి తుట్లు పొడుస్తుందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విమర్శించారు. నాయుడుపేట పట్టణం పాత బస్టాండ్‌లోని జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోందని, ప్రజలను వేధింపులు, చిత్రహింసలకు గురి చేస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని విమర్శించడం తప్ప, ప్రజా సంక్షేమం గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సంపద సృష్టిస్తామంటూ మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు ప్రకృతి సంపదైనా ఇసుక, గ్రావెల్, మట్టి, సిలికా, ఎర్రచందనం తదితర వాటిని కొల్లగొడుతూ ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నారన్నారు. కూటమి సర్కారు ఆరు నెలల పాలనలో చిన్నారులు, మహిళలపై 110కి పైగా లైంగికదాడులు జరిగాయని, 10 మందికి పైగా మృతి చెందారని, దీంతో రాష్ట్రం రావణ కాష్టంగా మారుతుందన్నారు. గామాల్లో మద్యం విక్రయాలకు బహిరంగ వేలం పాటలు పెడుతూ 24 గంటలకు గ్రామాల్లో అమ్ముకునేలా చేస్తున్న దౌర్భాగ్యపు పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

చిరువ్యాపారుల నిరసన

- వంద రోజులకు చేరిన ఉద్యమం
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి మెట్టు మార్గంలో చిరు వ్యాపారం చేసుకునే వారి సమస్యలను పరిష్కరించకుంటే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, జిల్లా కార్యదర్శి జయచంద్ర హెచ్చరించారు. తిరుమల శ్రీవారి మెట్టు మార్గంలో వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల దీక్ష గురువారానికి వంద రోజులకు చేరుకుంది. గత వంద రోజులుగా వీరు టీటీడీ పరిపాలనా భవనం వద్ద నిరసనకు దిగారు. ఈ దీక్షకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, జిల్లా కార్యదర్శి జయచంద్ర మద్దతు ఇచ్చారు. టీటీడీ అధికారులు చిరువ్యాపారులకు న్యాయం చేయాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ శ్రీవారి మెట్టు మార్గంలో 30 కుటుంబాలకు పైగా ఎన్నో ఏళ్లగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయన్నారు. ప్రస్తుతం వీరిని అక్కడ వ్యాపారం చేసుకోనివ్వకుండా అధికారులు అడ్డు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో టీటీడీ పరిపాలనా భవనం వద్ద దీక్ష చేపట్టినట్టు తెలిపారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి సాయిలక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకులు సుబ్రహ్మణ్యం, ఆర్టీసీ యూనియన్ నాయకులు శివకుమార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కందారపు మురళి

శ్రీవారి సేవలో 399 మంది ప్రత్యేక ప్రతిభావంతులు

తిరుమల : హైదరాబాద్‌కు చెందిన అష్టోత్తర చుక్కల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు వేణుకుమార్ చుక్కల ఆధ్వర్యంలో గురువారం 399 మంది వృద్ధులు, అంధులు, బధిరులు, పేద, మానసిక స్థితి సరిగా లేని వారు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరంతా తొలిసారిగా స్వామిని దర్శించుకుని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ట్రస్టు ద్వారా 2014 నుంచి ఇప్పటివరకు దాదాపు 2,500 మందికి పైగా భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : కూటమి ప్రభుత్వం హయాంలో అధికారులు వివిధ కారణాలతో టీచర్లను వేధిస్తున్నారని, టీచర్ల అకాల మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వివిధ యాప్‌లు, పని ఒత్తిడిలో ఉన్న టీచర్లపై మరింత ఒత్తిడితో కూడిన నిర్ణయాలతో టీచర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. పని గంటలు పెంచి పైలెట్ ప్రాజెక్టుగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలల పని వేళలు మార్పునకు ప్రతిపాదించడం, సెలవులను 10 శాతానికి పరిమితం చేయడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వ తీరు మారకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

వైద్యోనారాయణ.. ఏదీ మీ చిరునామా?

- వైద్యులు రారు.. చికిత్స అందదు
- పాపానాయుడుపేట పీహెచ్‌సీ తీరిది

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు మండలం పాపానాయుడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేరుకు ఇద్దరు డాక్టర్లున్నా ఎప్పుడొస్తారో.. ఎప్పుడు వెళ్తారో.. తెలియని అయోమయ పరిస్థితి.. మండలంలోని పాపానాయుడుపేట పీహెచ్‌సీలో డాక్టర్ నాగరాజు, డాక్టర్ మధురిమ ఇద్దరు వైద్యులు ఉన్నారు. గురువారం ఆస్పత్రికి ఇద్దరూ రాకపోవడంతో రోగులకు సిబ్బందే మందుబిళ్లలు ఇచ్చి పంపారు. కొందరు రోగులు చేసేది లేక ఉసూరుమంటూ తిరుగుమఖం పట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చి ఆయా సబ్ సెంటర్ల పరిధిలో దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించే పరిస్థితి ఉండేది. అయితే ప్రస్తుతం ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వైద్య, ఆరోగ్య సేవలు నిర్లక్ష్యపు కౌగిట్లో చిక్కుకున్నాయి. ఈ విషయమై వైద్యాధికారిని 'సాక్షి'ఫోన్‌లో వివరణ కోరగా ఆయన మళ్లీ ఫోన్ చేస్తానని కట్ చేశారు. మళ్లీ ఫోన్ చేస్తే ఆయన తీయలేదు.


పాపానాయుడుపేట పీహెచ్‌సీలో డాక్టర్ లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

పోస్టింగ్ అక్కడ.. విధులిక్కడ

ఏర్పేడు మండలం, పెనుమల్లం ఆరోగ్య ఉప కేంద్రానికి చెందిన ప్రభావతి అనే ఏఎన్ఎం అక్కడ విధులు నిర్వహిస్తున్నట్లు రిజిస్టర్‌లో సంతకాలు చేసి, పీహెచ్‌సీలోనే తిష్టవేసి, నామమాత్రపు విధులు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీలో సిబ్బంది కొరత లేకపోయినా, ఆమెను జిల్లాస్థాయి వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఓ అధికారి అండదండలతో ఉపకేంద్ర పరిధిలో వైద్యసేవల నుంచి తప్పించి పీహెచ్‌సీకే పరిమితం చేశారన్న విమర్శలున్నాయి.

ఉపాధి అక్రమాలపై విజిలెన్స్ విచారణ

కలువాయి: మండలంలోని చినగోపవరం పంచాయతీలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనుల్లో జరిగిన అవినీతిపై రాష్ట్ర విజిలెన్స్ అధికారి బి.శ్రీభవానీహర్ష, డ్వామా పీడీ గంగాభవానీతో కలిసి గురువారం విచారణ జరిపారు. బయటి వ్యక్తులను గ్రామానికి చెందిన వారి కుటుంబాల్లో సభ్యులుగా నమోదు చేసి, జాబ్‌కార్డులు సృష్టించి, వారు ఉపాధి పనులకు హాజరైనట్లు బోగస్ మస్టర్లు వేసి రూ.26.85 లక్షలు నిధులు స్వాహా చేశారని సోషల్ ఆడిట్‌లో వెలుగులోకి వచ్చింది. అందులో తమకు ఎటువంటి సంబంధం లేదని, వారు తమ కుటుంబ సభ్యులు కాదని, విచారణలో బాధిత కుటుంబాల వారు తేల్చిచెప్పారు. గ్రామంలో విచారణ అనంతరం అధికారులు కలువాయి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం రికార్డులను పరిశీలించారు. ఈ విషయమై విజిలెన్స్ అధికారి శ్రీభవానీ హర్ష మాట్లాడుతూ దళిత, గిరిజనుల కుటుంబాల్లో బయటి వ్యక్తులను చేర్చి, వారి పేరున మస్టర్లు వేసి, వారి అకౌంట్లకు నగదు జమ చేసిన విషయంపై విచారణ జరిపామని, ఎవరి అకౌంట్లలో నగదు జమచేశారో వారు తమ కుటుంబసభ్యులు, కాదని బాధితులు చెప్పినట్లు తెలిపారు. అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, డీపీఓ విజయలక్ష్మి, ఏపీడీ శంకర్‌నారాయణ, ఎస్టీఎం ఎం.కోనయ్య పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న స్టేట్ విజిలెన్స్ అధికారి